క్లుప్తంగా

వృత్తి విద్యపైనా అవగాహన అవసరం


ఏపీజీబీ బ్యాంకును సందర్శించిన విద్యార్థులు

పుల్లలచెరువు: పదో తరగతి విద్యార్థులకు విద్యతో పాటు వృత్తి విద్యపై అవగాహన అవసరమని వొకేషనల్ ట్రైనర్ మల్లికార్జున అన్నారు. వొకేషనల్ ఎడ్యుకేషన్ కంప్యూటర్ శిక్షణపై ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా స్థానిక జెడ్పీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఏపీజీబీ బ్యాంకును సందర్శించారు. మేనేజర్ విద్యార్థులకు బ్యాంకులో జరుగుతున్న డిజిటల్ లావాదేవీలను, మొబైల్ బ్యాంకింగ్, అన్ని రకాల లోన్స్, ఇన్సూరెన్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విజిట్ అనేది విద్యార్థులకు స్వీయ అనుభవమని, బ్యాంకు సేవలు, సైబర్ నేరాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవడం మంచి పరిణామం అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు


పుల్లలచెరువు: రైతులకు సూచనలిస్తున్న ఏవో నిర్మలాదేవి

పుల్లలచెరువు: ప్రస్తుతం కంది పూత దశలో ఉందని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. బుధవారం నరజాముల తండా, మల్లాపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో కంది పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఏవో రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు సాగు చేసిన కంది పంట పూత దశలో ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేపగింజల కషాయం వాడితే పురుగు రాకుండా నివారించవచ్చన్నారు. పచ్చ పురుగు, మచ్చల పురుగు కూడా వచ్చే అవకాశం ఉందని, దానికి తగు మందులు వాడాలన్నారు. రబీ పంటకు ఫసల్ బీమా యోజన కింద రైతులు తమ పేర్లను డిసెంబర్ 15వ తేదీలోపు పోర్టర్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంఐఏవో అధికారి రామయ్య, వీఏఏ కె.ప్రశాంత్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

దొనకొండ: సమాజంలో చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేస్తున్నారని, ఆడ పిల్లల చదువు సమాజానికి ఎంతో ముఖ్యమని, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని, బాల్య వివాహాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.నాగమణి హెచ్చరించారు. స్థానిక బాలికల పాఠశాలల్లో బుధవారం బాల్య వివాహ రహిత భారత్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ బి.సతీష్‌బాబు పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి బాల్య వివాహ రహిత భారత్‌ను సాధించేలా కృషి చేయాలన్నారు. వెలుగు ఏపీఎం సైమన్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలించాలనే చట్టం గురించి వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. స్థానిక కేజీబీవీలో క్యాండిల్ ర్యాలీ చేశారు.

గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి


గో హత్యలు నివారించాలంటూ నినాదాలు

దొనకొండ: గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించి గో హత్యలు చేసేవారిని చట్టప్రకారం శిక్షించాలని విశ్వ హిందూ పరిషత్ ప్రముఖులు సోమ సుబ్బారావు, వర్ల వెంకట రెడ్డి, టెక్కలి కోటేశ్వరరావు, పాలేరు బ్రహ్మానందరెడ్డి కోరారు. స్థానిక ఆనంద ఆశ్రమంలో హిందూ సమాజం సంఘటంగా ఉండాలని విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గోహత్యలు చేసే వారిని శిక్షించాలని, దేవాలయాల్లో నిత్య ధూపదీప నైవేద్యాలు జరపాలని, హైందవ సమాజంలో అందరూ సంప్రదాయబద్ధంగా ఉండాలని, హిందువులందరూ ఐక్యంగా మన ధర్మాన్ని కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరూ భక్తి భావాలతో ఉండాలని కోరారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు భైరవనాంద స్వామి అన్ని వసతులు కల్పించారు.


చిల్లచెట్లతో మూసుకుపోయిన మరుగుదొడ్డు


పర్యవేక్షణ లేక పగుళ్లిస్తున్న భవనం


నిరుపయోగంగా ఉన్న ముండ్లమూరు బస్టాండ్

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- పల్లెలకు రాని పల్లె వెలుగు
- బస్టాండ్‌లోకి రాని బస్సులు
- శిథిలావస్థకు చేరుకుంటున్న బస్టాండ్
- ఎక్కడ నిల్చోవాలో తెలియక ప్రయాణికుల అవస్థలు

ముండ్లమూరు (దర్శి):

ముండ్లమూరు ఆర్టీసీ బస్టాండ్ భవనం నిరుపయోగంగా ఉంది. లోనికి బస్సులు వెళ్లక పోవడంతో దారి చిల్ల చెట్లతో మూసుకెళ్లింది. ఆర్టీసీ బస్టాండ్ ఉపయోగంలో లేక ఏ సమయంలో బస్టాండ్‌కు బస్‌లు వస్తాయో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లోకి మందుబాబులు మద్యం తాగుతూ సేద తీరుతున్నారు. బాత్‌రూమ్‌లు చిల్లచెట్లతో నిండాయి. అసాంఘిక కార్యకలాపాలు, జూదరులకు బస్టాండ్ నిలయంగా మారుతోంది. పర్యవేక్షణ లేక పోవడంతో నిర్మాణాలు పగుళ్లిస్తున్నాయి. చేసేది లేక ప్రయాణికులు ఆటోలు, జీపులను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో వాటి కోసం ఎక్కడ నిల్చోవాలో తెలియక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎప్పుడో ఒక సారి వచ్చే బస్సు కోసం కూర్చోవడానికి నీడలేక ఎండకు నిలబడి ఉండలేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. చిన్న పిల్లల తల్లులు, గర్భిణులు ప్రయాణం కోసం వచ్చి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొన్నేళ్లుగా అద్దంకి, పొదిలి, వినుకొండ డిపోల నుంచి ముండ్లమూరుకు బస్సులు వచ్చి వెళ్తున్నాయి. కొన్ని బస్సు సర్వీసులను అకారణంగా రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


బస్సు కోసం ఎండలో నిల్చొన్న ప్రయాణికులు

గ్రామాలకు వెళ్లని బస్సులు

మండలంలోని పోలవరం, తూర్పు కంభంపాడు, వేములబండకు అద్దంకి డిపో నుంచి ఆర్టీసీ బస్సులు నడిపారు. శింగన్నపాలెం, ఈదర వయా రమణారెడ్డిపాలెం, వేములకు బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం ఆ సర్వీసులను ఆపేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు చేసేదేమీ లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. తూర్పు కంభంపాడుకు కొన్నేళ్లకుపైగా అద్దంకి డిపో బస్సు రోజూ ఉదయం, సాయంత్రం తిరుగుతూ ఉండేది. కొద్దికాలంగా ఆ బస్సులు రద్దు చేశారు. మారెళ్ల, మక్కినేనివారిపాలేనికి బస్సు సర్వీసు ఉండేది. ప్రస్తుతం ఆ సౌకర్యం కూడా లేదు. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు ఆటోలు ఎక్కి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దాదాపు 20 గ్రామాలకుపైగా ఇటీవల ఆర్టీసీ సౌకర్యం రద్దు కావడం గమనార్హం. గతంలో నడిపిన సర్వీసులను పునరుద్ధరించి ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మతులు చేసి దాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించేది ఎవరు?


మొక్కలకు నీరు పెడుతున్న రైతులు


పొలానికి వెళ్లి ఫొటోలు తీస్తున్న టీఏ

- బిల్లులు చెల్లించాలని ఎంపీడీఓను కోరిన రైతులు
- ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడగమని చెప్పిన ఎంపీడీఓ
- నివ్వెరపోయిన బాధిత రైతులు

పుల్లలచెరువు: మండలంలోని రాచకొండ పంచాయతీ వెంకటరెడ్డిపల్లి రైతులు ఉపాధి హామీ పథకంలో భాగంగా తమ పొలాల్లో నిమ్మ మొక్కలు నాటుకున్నారు. వాటికి సంబంధించిన బిల్లులు చెల్లించండని ఎంపీడీవో వసంతరావు నాయక్‌ను సంబంధిత రైతులు కోరారు. తన పని మొత్తం చేశానని, ఒక్కసారి ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగితే మీ పని అయిపోతుంది కదా.. అనే సమాధానం చెప్పడంతో రైతులు కృష్ణారెడ్డి, పిచ్చిరెడ్డి, రామకృష్ణారెడ్డి, బంగారురెడ్డి, నారు బంగారురెడ్డిలు నివ్వెరపోయారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బాధిత రైతులు విలేకరులతో మాట్లాడారు. వెంకటరెడ్డిపల్లికి చెందిన రైతులైన తాము 2023–2024 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిమ్మ మొక్కలు నాటామని, వాటికి వాచ్ అండ్ వార్డు కింద మూడు సంవత్సరాలు బిల్లులు ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లించాల్సి ఉందని చెప్పారు. గ్రామంలో మొక్కలు నాటిన రైతుల్లో కొందరికి అధికారులు బిల్లులు చెల్లించారని, మరి కొందరికి బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు జమకాని రైతులు ఉపాధి హామీ పథకం ఏపీవోను, టీఏను పలుమార్లు కోరినా స్పందించలేదని విచారం వ్యక్తం చేశారు. కిందిస్థాయి అధికారులను పదేపదే అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. చివరకు తాము ఎంపీడీవో వద్దకు వెళ్లి సార్ తమకు బిల్లులు పెట్టండని కోరగా ఆయన మీ పని మొత్తం చేశానని, సీవో కూడా ఇచ్చానని, ఫీల్డ్ అసిస్టెంట్‌ను కలవండి.. పని అయిపోతోంది కదా..? మీకు తెలియని విషయాలు కాదని ఎంపీడీఓ చెప్పడంతో తాము నివ్వెరపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఏడాదిగా ఎదురుచూపు

నాటిన మొక్కలను బతికించుకునేందుకు రైతులు ఏడాదిగా ట్యాంకర్ల ద్వారా నీరు పెట్టుకున్నారు. బిల్లులు చెల్లించమన్న పాపానికి కిందిస్థాయి సిబ్బందిని అడగమని సాక్షాత్ ఎంపీడీఓ సలహా ఇవ్వడంపై బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము కేవలం వైఎస్సార్ సీపీ మద్దతుదారులమన్న కారణంతో తమ మొక్కలకు బిల్లులు చెల్లించడం లేదని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. విషయాన్ని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఏపీవోను వివరణ కోరగా తాను, టీఏలు బిల్లులు చేసి ఎంపీడీఓకు ఎంబుక్‌లు అందజేశామని చెప్పారు. త్వరలోనే బిల్లులు చేస్తామని ఆయన పేర్కొన్నారు.


కార్యాలయం వద్ద మాట్లాడుతున్న బాధిత రైతులు

అయ్యప్ప గుడికి బియ్యం అందజేసిన ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం స్థానిక అయ్యప్ప స్వామి గుడికి 5 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. అయ్యప్ప స్వామి మాలాధారణ చేసిన స్వాములకు భోజన సదుపాయం కోసం తనవంతుగా బియ్యం అందజేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, భూమిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


అయ్యప్ప గుడికి బియ్యం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

కురిచేడు (దొనకొండ): విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోకుండా పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎస్‌ఐ ఎం.శివ పేర్కొన్నారు. స్థానిక వైఆర్ జెడ్పీ పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివ మాట్లాడుతూ బాల బాలికలను వేధించటం, ర్యాగింగ్‌కు పాల్పడటం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. యువకులు గంజాయి, డ్రగ్స్ వాటికి బానిసలు కాకూడదని సూచించారు. అంతేకాకుండా ఆన్‌లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటీపీ, బ్యాంక్ వివరాలు అడిగితే చెప్పకుండా జాగ్రత్త పడాలన్నారు. సమాజంలో విద్యార్థులు చెడు అలవాట్లకు లోనవకుండా చక్కగా చదువుకుని పాఠశాలకు, గురువులకు, సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పెట్టి క్రమశిక్షణతో మెలగాలని ఎస్‌ఐ సూచించారు. హెచ్‌ఎం జీఎస్‌ఆర్ సాయి, జేఈ మంజూష, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌ఐ శివ

ఆరోగ్య కేంద్రంలో సమస్యల పరిష్కారానికి చర్యలు

- డీసీహెచ్‌ఎస్ సూరిబాబు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పటల్ సర్వీసెస్ (డీసీహెచ్‌ఎస్) సూరిబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. వైద్యశాలలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు వైద్యశాలలో ఎక్సరే ప్లాంట్ లేక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా త్వరలోనే ఎక్సరే ప్లాంట్‌ను ఏర్పాటు చేసి పరికరాలు తెప్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని పలువురితో చర్చించి పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో పాటు మండల పరిధిలోని పలు రహదారులు ఘాట్ రోడ్లతో కూడుకున్నవని, ఆయా రోడ్లలో ప్రమాదాల తీవ్రత అధికంగా ఉంటుందన్న విషయాన్ని ఆయన దృష్టికి స్థానిక వైద్యులు తీసుకెళ్లారు. తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుని ఎక్కువ శాతం మృత్యువాత పడుతుంటారని తెలిపారు. వైద్యశాలలో పోస్టుమార్టం గది లేక పోవడంతో ఈ ప్రాంతంలోని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆయన వైద్యశాలలోని రికార్డులు పరిశీలించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ నాగమహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశాలలోని రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ సూరిబాబు

మధ్యాహ్న భోజనం పరిశీలన


కుకింగ్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈఓ అమీర్‌బాషా

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ పరిధి జెడ్పీ ఉన్నత పాఠశాల, ఇతర ప్రాథమిక పాఠశాలల్లో మండల విద్యాధికారి-2 షేక్ అమీర్‌బాషా మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెనూ ప్రకారం తయారు చేసి భోజనాన్ని రుచి చూశారు. నిర్వాహకులకు సూచన, సలహాలందించారు. మెనూ ప్రకారం క్రమం తప్పకుండా రోజూ భోజనం తయారు చేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని చెప్పారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టీ, రికార్డులను ఎంఈఓ పరిశీలించారు.

కేజీబీవీని సందర్శించిన డీఎస్పీ


వసతులు పరిశీలిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు (దర్శి): స్థానిక కేజీబీవీ పాఠశాలను డీఎస్పీ లక్ష్మీనారాయణ బుధవారం సందర్శించారు. విద్యార్థులతో డీఎస్పీ మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యతో పాటు అన్నీ రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో వసతులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, ప్రిన్సిపాల్ ఆవుల సునీత, పద్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా చర్చావేదిక


పోస్టర్లు ప్రదర్శిస్తున్న అధ్యాపకులు

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ, చర్చావేదిక బుధవారం నిర్వహించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ ఆఫ్ కాలేజీతో కలిసి ఎయిడ్స్‌పై పోస్టర్ ప్రదర్శనలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణ మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి నివారణ చర్యలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఆర్ఆర్‌సీ కో ఆర్డినేటర్ వి.సుజాత మాట్లాడుతూ జువాలజీ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో పోస్టర్ ప్రజెంటేషన్, డిబెట్ నిర్వహించారు. అధ్యాపకులు ప్రభుదాస్, జి.వేణు, కుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్ పనులు పూర్తి చేయాలి


మార్జిన్‌లు లేక ఎత్తుగా ఉన్న రోడ్డు


ఎదురెదురుగా వచ్చిన లారీలతో ఇలా..

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం–తాళ్లూరు రోడ్డులో రోడ్డు మార్జిన్ పనులు పూర్తి చేయాని స్థానికులు కోరుతున్నారు. గంగవరం, లింగాలపాడు, మాధవరం, కొత్తపాలేల్లో రోడ్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకుండా పనులు ఆపేశారని స్థానికులు మండిపడుతున్నారు. అడుగు మందంతో రోడ్డు వేసినా రోడ్డు వెంబడి మార్జిన్‌లో మట్టి వేయడం మర్చిపోయారు. దీంతో ద్విచక్ర వాహనాల నుంచి నాలుగు చక్రాల వాహనాల వరకు ఒకేసారి ఎదురుపడితే సైడ్ దిగాలంటే ప్రమాదాలకు గురవుతున్నారు. లోడ్ వాహనాలు ఎదురెదురుగా వచ్చాయంటే మార్జిన్ దిగేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఆ సమస్యలను అధికారులు పట్టించుకుని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.